నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 26 డిసెంబర్ 2024 | KHAMMAM

మధిర: బయ్యారం చర్చిలో పాస్టర్‌కు కేక్ తినిపిస్తున్న ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

ఓ ప్రభువా..

- ఉమ్మడి జిల్లాలో కరుణామయుడి జన్మదిన వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన చర్చిలు, ప్రార్థనా మందిరాలు
- క్రిస్మస్ రోజు బైబిల్ సందేశం వినిపించిన దైవజనులు
- ఆకట్టుకున్న శాంతాక్లాజ్, పశువుల పాక సెట్టింగులు

లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను క్రైస్తవులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం భక్తిప్రపత్తులతో వైభవోపేతంగా జరుపుకున్నారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన చర్చిలకు భక్తులు చేరుకుని మంగళ వారం అర్ధరాత్రి నుంచే యేసయ్యను స్మరిస్తూ ఆరాధనలు, ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ భక్తిభావంతో కీర్తించారు. బుధవారం తెల్లవారుజామున వందలాది మంది భక్తులు వర్షపు జల్లులను సైతం లెక్క చేయకుండా చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రముఖ చర్చిలలో దైవజనులు బైబిల్ సందేశం, యేసుచూపిన మార్గాన్ని వివరించగా.. భక్తులు ఆసక్తిగా విని తరించారు. ఆయా చర్చిలలో చిన్నారుల శాంతాక్లాజ్ వేషధారణలు, క్రిస్మస్ ట్రీ, పశువుల పాక సెట్టింగులు ఆకట్టుకున్నాయి. ఖమ్మం నగరంలోని చర్చి కాంపౌండ్ సీఎస్ఐ చర్చి, వైరా రోడ్‌లోని ఆర్‌సీఎం చర్చి, ఎన్నెస్పీ హోలిట్రినిటి చర్చి, ఇందిరానగర్ సీఎస్ఐ చర్చి, కరుణగిరి చర్చి, మౌంట్ ఫోర్డ్ సెయింట్ జోసెఫ్ చర్చి, మిషన్ ఆసుపత్రి రోడ్‌లోని ఫెయిత్ పవర్ ప్రేయర్ టవర్, ముస్తఫా నగర్‌లోని ఏసయ్య ప్రేయర్ మినిస్ట్రీ, రోటరీ నగర్ గుడ్ షెఫర్డ్ చర్చి, బల్లేపల్లి ఆరోగ్యమాత మందిరాల్లో యేసు ప్రభువు జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెంలోని ఆండ్రూస్ చర్చి, సీఎస్ఐ, ఆర్‌సీఎం, బేతనియా, పెంతెకోస్తు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు రాజకీయ ప్రముఖులు చర్చిలకు చేరుకుని క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భక్తులతో ఆయా చర్చిలన్నీ కిటకిటలాడాయి.

- ఖమ్మం/కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 25

పెనుబల్లి: మహిళకు చీరలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కరుణగిరి చర్చిలో దైవ సందేశం వినిపిస్తున్న బిషప్ సగిలి ప్రకాశ్

ఖమ్మంలోని చర్చిలో బైబిల్ సందేశం వింటున్న భక్తులు

కొత్తగూడెం టౌన్: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

అన్నపురెడ్డిపల్లి: ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

కలకోట తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ సదానందం ఆధ్వర్యంలో వేడుకలు

వంటావార్పుతో సీఆర్టీల ఆందోళన

ఐటీడీఏ వద్ద ఆరో రోజుకు చేరిన నిరవధిక సమ్మె

వంటావార్పు అనంతరం శిబిరంలో భోజనం చేస్తున్న సీఆర్టీలు

భద్రాచలం, డిసెంబర్ 25 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం ఐటీడీఏ ఎదుట ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్టీలు) చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు వంటావార్పు చేసి వినూత్న నిరసన తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. క్రిస్మస్ పండుగ కావడంతో దీక్ష వద్దే కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ(టీడబ్ల్యూటీయూ) జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రవికుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి రాజేశ్, మహిళా అధ్యక్షురాలు పాంచాలి కమల, జిల్లా సీనియర్ నాయకులు వీరన్న, రవి, బాబూరావు, సురేశ్, హరిరాం, రాందాస్, నిర్మల, సునీత, వెంకటరమణ, రాము, బుచ్చయ్య, లక్ష్మణ్, నర్సింహారావు పాల్గొన్నారు.

'ఎస్ఎస్ఏ' ఉద్యోగుల వినూత్న నిరసన

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 16వ రోజుకు చేరిన సమ్మె

కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద వంటావార్పుతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్/ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 25 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు(ఎస్ఎస్ఏ) చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 16వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా భద్రాద్రి, ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చౌక్‌లలో ఉద్యోగులు వినూత్న నిరసనలు తెలిపారు. భద్రాద్రి కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు రోడ్డుపై వంటావార్పు, పిండివంటలు చేసి నిరసన తెలిపారు. సమ్మెకు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గాంధీ, బాలాజీ, సీతారాంనాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు హాతీరాంపవార్ తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మోహన్, చందు, తులసి, సిద్ధయ్య, వనమా సురేశ్, పార్వతి, కవిత, జయబాబు, ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం ధర్నా చౌక్ వద్ద క్రిస్మస్ పండుగ సందర్భంగా సమ్మె చేస్తున్న ఉద్యోగులు కేక్ కట్ చేసి, తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రార్థన చేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని కలిసి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌పాషా, అనిల్, నిర్మల, విజయలక్ష్మి, ఇస్మాయిల్, సాంబశివరావు, కృష్ణప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ఖమ్మం ధర్నాచౌక్ వద్ద క్రిస్మస్ ప్రార్థన చేసి కేకులు తినిపించుకుంటున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గొంగడి త్రిష(ఫైల్)

అండర్-19 టీ 20 ప్రపంచ కప్ జట్టులో త్రిష

భద్రాద్రి కీర్తిని నలుదిశలా చాటిన క్రీడాకారిణి

భద్రాచలం, డిసెంబర్ 25 : ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం పట్టణానికి చెందిన గొంగడి త్రిష మహిళల అండర్-19 టీ 20 వరల్డ్ కప్‌కు బీసీసీఐ ప్రకటించిన జట్టులో చోటు దక్కించుకుంది. ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన అండర్-19 టీ 20 ఆసియాకప్‌లో త్రిష విశేషంగా రాణించింది. 47 బంతుల్లో 52 పరుగులు చేసి భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. దీంతో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా త్రిష ఎంపికైంది. జనవరి నుంచి జరగనున్న మహిళల అండర్-19 టీ 20 వరల్డ్ కప్‌కు బీసీసీఐ ప్రకటించిన జట్టులో త్రిషకు చోటు దక్కడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. త్రిష అండర్-16లో రాష్ట్ర జట్టుకు 2012-13లో ఎంపికైంది. అండర్-19, అండర్-23 విభాగాల్లో ఓపెనర్ బ్యాట్స్‌మెన్‌గా, లెగ్ స్పిన్నర్‌గా రాణించి ప్రస్తుతం సీనియర్స్‌తో ఆడుతోంది. 2018లో నేషనల్ క్రికెట్ అకాడమీ జట్టుకు ఎంపికైంది. అకాడమీ చైర్మన్ నిరంజన్‌షా, డైరెక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్‌లు ఆమెను 12 మంది జట్టు సభ్యుల్లో ఒకరిగా ఎంపిక చేయడం విశేషం. తండ్రి గొంగడి రాంరెడ్డి కోరిక మేరకు క్రికెట్‌లో భద్రాచలంలో ఓనమాలు నేర్చుకున్న త్రిషను మెరుగైన శిక్షణ కోసం ఏడేళ్ల వయసులోనే హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆనాటి జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో రాణిస్తూ అంచలంచెలుగా ఎదుగుతున్నది.

'ముక్కోటి'కి ఘన ఏర్పాట్లు

- 31 నుంచి జనవరి 8 వరకు దశావతారాల్లో రామయ్య దర్శనం
- వివరాలు వెల్లడించిన భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి

సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, డిసెంబర్ 25: ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఘనంగా జరుపనున్నట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. దేవస్థానంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకు వైకుంఠ అధ్యయనోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 31 నుంచి జనవరి 8వ తేదీ వరకు సీతారామచంద్రస్వామి వారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. వీటితోపాటు ప్రతిరోజూ మిథిలా స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముక్కోటి వేడుకల్లో ప్రధానంగా జనవరి 9న తెప్పోత్సవం, రామయ్య నదీ విహారం, 10న వైకుంఠ ద్వారదర్శనం తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల వరకు వైభవంగా నిర్వహించనున్నటు తెలిపారు. భక్తుల కోసం ఆన్‌లైన్ ద్వారా టికెట్లను 11వ తేదీ నుంచే అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశి కోసం భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏఈవో భవానీకృష్ణ, ప్రధాన అర్చకులు అమరవాది విజయ రాఘవన్, ఈఈ రవీందర్ పాల్గొన్నారు.

కొత్త రేషన్.. ఉత్తమాటే?

- రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు
- కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రకటనలకే పరిమితమైన మంత్రుల మాటలు
- సంకాంత్రి నాటికి ఇస్తామని ఊరిస్తున్న సర్కార్
- మళ్లీ దరఖాస్తుల స్వీకరణకు సిద్ధం!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు వేయికళ్లతో ఎదురుచూడడం పరిపాటిగా మారింది. అమలుకాని హామీలను ఆశగా చూపి రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న హస్తం పార్టీ ఓట్లేసిన ప్రజలనే మోసం చేస్తున్నది. ఏడాది పాలన పూర్తయినప్పటికీ ఇంతవరకు ఒక్క హామీ కూడా అమలుచేసిన పాపానపోలేదు. పింఛన్ల పెంపు లేదు.. మహిళలకు ఇస్తానన్న రూ.2,500 లేవు.. స్కూటీలు లేవు.. రైతులకు రుణమాఫీ లేదు.. రైతుబంధు డబ్బులు లేవు.. నిరుద్యోగ భృతి లేదు.. ఇందిరమ్మ ఇండ్లు లేవు.. ఇలా చెప్పకుంటూపోతే 420 హామీల్లో ఒక్క హామీని కూడా నెరవేర్చిన దాఖలాలు కనిపించట్లేదు. ముఖ్యంగా పేదలకు అత్యవసరమైన కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. కనీసం రేషన్ కార్డులో పిల్లల పేర్లు సైతం జత చేయకపోవడం గమనార్హం. వీరంతా ఆరోగ్యశ్రీ వంటి పలు పథకాలకు దూరమవుతున్నారు. తాజాగా అసెంబ్లీ సమావేశాల్లో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి నాటికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మరోసారి ఊరించారు. అయితే కాలయాపన చేయడమే తప్ప ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఖమ్మం, డిసెంబర్ 25

ఖమ్మం జిల్లా జనాభా సుమారు 20 లక్షలకు పైగానే ఉంది. జిల్లాలో మొత్తం 4,11,147 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. వీరందరూ ప్రతి నెల బియ్యం తీసుకుంటారు. వీరిలో అంత్యోదయ కార్డులు(35 కిలోలు) 27,276 కాగా.. ఆహార భద్రత కార్డులు 3,83,868 ఉన్నాయి. వీటితోపాటు అన్నపూర్ణ కార్డులు 3(ఒక్క కార్డుకు 10 కిలోలు ఉచితం) ఉన్నాయి. ఈ మొత్తం కార్డుల్లో లబ్ధిదారులు 11,29,235 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం 6 కిలోల చొప్పున బియ్యం ప్రతి నెలా సరఫరా చేస్తున్నది. అయితే పంపిణీ విషయంలో ఒక్కో నెలా ఒక్కో రకంగా మారుతుంది. లబ్ధిదారులు ప్రతి నెలా తీసుకునే బియ్యాను అంచనా వేసి స్టాక్ బియ్యం పోను మిగిలిన బియ్యాను మాత్రమే రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తారు.

48,113 మంది ఎదురుచూపు..

ఖమ్మం జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 48,113 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అధికారుల విచారణ తరువాత అప్రూవల్ అయినవి 8,876 కాగా.. వివిధ దశల్లో ఉన్నవి 38,494, అధికారులు తిరస్కరించినవి 743 ఉన్నవి. అయితే ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, తొలగించిన వారి పేర్లు యాడ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. వీరు కూడా వేల సంఖ్యలో ఉండవచ్చునని అంచనా. ఉమ్మడి కుటుంబాల నుంచి వేరుపడిన వారు, కొత్తగా వివాహాలు జరిగిన వారు రేషన్ కార్డుల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా పాత కార్డులలో పేర్లు తొలగించుకున్న వారి పేర్లు కూడా నమోదు చేయలేదు. పిల్లల పేర్లు కూడా కార్డుల్లో చేర్చలేదు. ఇలాంటి వారంతా ప్రభుత్వం అందించే ఉచిత బియ్యంతోపాటు ఆరోగ్యశ్రీ సేవలకు దూరమవుతున్నారు. పేదలు రేషన్ కార్డుల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకునేలా పోర్టబిలిటీ అవకాశం ఉండడంతో ఉపాధి కోసం వలస వెళ్లిన వారు సైతం కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

మళ్లీ దరఖాస్తుల స్వీకరణ?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అభయహస్తం ఆరు గ్యారెంటీలతోపాటు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. వాటిని ఆన్‌లైన్ చేయకుండా భద్రపర్చారు. వాటి ఆధారంగా కార్డులను జారీ చేస్తారా? లేక మళ్లీ కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తారా? అనే దానిపై స్పష్టత లేదు. ప్రస్తుతం డిజిటల్ విధానంలో క్యూఆర్ కోడ్, మైక్రో చిప్, బార్‌కోడ్‌తో కొత్త కార్డులు అందజేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారనే తప్ప కార్యరూపం దాల్చడం లేదు.

జాతీయ స్కూల్ గ్రేమ్స్ అథ్లెటిక్స్‌లో..

సత్తుపల్లి విద్యార్థినికి రెండోస్థానం

మెడల్స్‌తో ప్రణీత

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 25: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తుపల్లికి చెందిన విద్యార్థిని అద్భుత ఆటతీరు కన్పించింది. వివిధ ఈవెంట్లలో రెండో స్థానంలో నిలిచింది. సత్తుపల్లికు చెందిన కొమ్ము గురవయ్య, సల్మా దంపతుల కుమార్తె ప్రవీణ. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి స్కూల్ గ్రేమ్స్‌కు హాజరైంది. 400 మీటర్లు, 600 మీటర్ల విభాగాల పరుగు పందేల్లో రెండో స్థానంలో నిలిచింది. ఇందుకు గాను సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకుంది. అదేవిధంగా 200 మీటర్ల పరుగుపందెంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న ప్రణీత.. భవిష్యత్‌లో మరిన్ని క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే రాగమయి, నియోజకవర్గ ప్రముఖులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలో బుధవారం ప్రణీతను సత్కరించారు.